


# గొల్లభామ కోక


**ఎ(్రకంకరబాట మీద రాజుల పెళ్ళిపల్లకీ మోసుకెళ్తున్నారు బోయీలు. ద్వారపూడిబట్ల సంతలో కొనుగోలు చేసిన దవిళేశ్వరం షావుకారు మూటల్ని ఒంటెద్దుబండి. మీదేసు కొస్తున్నాడు. వడ్లమూడి నారింజపళ్ళకావిళ్ళు, చేగల్లాట్లో తంపటేసిన తేగలకావిళ్ళూ మాధవరాయుడు పాలెం ఊళ్ళో కెళ్తున్నాయి. గోచీ పెట్టుకున్న కుర్రాడొకడు నెత్తిమీద కందికాయలు మోపేసుకుని రెండు సూడిగేదెల్ని, ఒక పాడిగేదెనీ తోలుకెళ్తున్నాడు. కంకరబాట పక్కన కాటన్‌దొరగారు కొత్తగా తవ్వించిన వెడల్పాటి గోదావరి కాలవలోంచి జనాన్ని మోసుకెళ్తుంది రాదారి పడవ.**

ఒకళ్ళనొకళ్ళు అంటిపెట్టుకుని గానుగచెట్టు మొదట్లో కూర్చున్న ఆ ఆడామగా టక్‌ట్లక్కు ట్లక్‌ట్లక్కుమని చప్పుడు చేసుకుంటూ వచ్చి పక్కనే ఆగిన గుర్రం కేసీ దాని మీద కూర్చున్న మనిషికేసీ చూసేరు. గజగజా ఒణికిపోతా నిలబడిపోయేరు.

ఆ గుర్రం మీద కూర్చున్న కాటన్‌దొరగారు వాళ్ళిద్దరికేసి నవ్వుతా చూసి ''మీరెవరు? ఏ వూర్నుంచొస్తున్నారు?'' అనేసి సుతిమెత్తగా అడిగేరు.

ఆయన నవ్వు ముఖం చూసిన వాళ్ళిద్దరిలో అదురూ బెదురూ తోళుం తగ్గినియ్యి.

కాస్సేపయ్యాకా వాళ్ళిద్దర్లో ఒకర్తయిన ఆ ఆడమనిషి నోరు విప్పి ''మాది రామచెంద్ర పురాన్ని జేర్చి ఉన్న పసలపూడండి నా పేరు గొల్లభామండి'' అంది.





''గొల్లభామా అదేం పేరు?'' కొంచెం విస్తుపోతా అడిగేరు కాటన్‌దొరగారు.

సిగ్గుపడతా నవ్వేసిన గొల్లభామ ''నా అసలుపేరు మోర్త నాగలక్ష్మండి. గొల్లభామ పురుగులేదండి చిన్నప్పుడు దాన్లాగ రివటలాగుండే దాన్నని అంతా అలా పిలవడం మొదలెట్టేరండి. పోతే దొరగారండీ...ఈరిది పెద్ద కులమండి. పడాల సుబ్బన్నగారి అబ్బాయిగారండి. పేరు పడాల ఎంకన్న గారండి...ఈరు కొప్పారం దత్తుడుగారు కూడానండి'' అంటా ఆగి కొంచెం ఊపిరి పీల్చుకుందో లేదో అందుకున్న పడాలెంకన్న 'మేవిద్దరం ఇష్టపడ్డావండి. అది మా నాన్నతో పాటు మా వూళ్ళో ఎవళ్ళకీ ఇష్టం లేదండి. ఆయ్... ఆళ్ళంతా మమ్మల్నిద్దర్నీ బళ్ళాల్తో తరుముకొస్తుంటే తప్పించుకుంటూ గేలాపెత్తి మాచారం వంతెన, మారేడుబాక రేవూ దాటి డొంకలూ తుప్పలూ దాటుకుంటా ఇలా గొచ్చేసేవండి దొరగారండీ''.

''సంతోషం..ఇప్పుడేం చేద్దావనుకుంటున్నారు?'' అడిగేరు కాటన్‌దొరగారు.

'వెనక్కిగాని వెళ్తే మా పసలపూడోళ్ళు మక్కేసి మా వూరి పుంతరేవులో ముంచేస్తారండి... మమ్మల్ని. కాబట్టండీ...ఇక్కడే ఎక్కడన్నా బతుకుదెరువు చూసుకుందారనుకుంటున్నావండి'' అన్నాడు పడాలెంకన్న.

కాస్సేపు ఆలోచించేక గుర్రం దిగి వాళ్ళ దగ్గరకొచ్చిన తెల్లటి ఆ పొట్టి దొరగారు..''సరే కొత్తగా తవ్విన ఈ కాలవలో బల్లకట్టు వేయించి దాన్ని మీ ఇద్దరికీ అప్పగిస్తాను. ఈ ఊళ్ళో ఒక ఎకరం పంట భూమి మీ పేర రాయిస్తాను ఆ ఎకరం పొలం పండించుకుని తింటా బల్లకట్టు మీద జనాన్ని దాటించండి'' అన్నారు.

దొరగారి బూట్లకాళ్ళకి దణ్ణవెట్టుకుని, సారంగధర మెట్ట మీద గుళ్ళో పెళ్ళి చేసుకుని అన్నవరంలో వ్రతం జేయించుకునొచ్చి ఆ కాలవ ఒడ్డున పాకేసుకుని కాపురం పెట్టేరు.

ఇద్దరూ గల్సి బల్లకట్టు నడపడం పొలం వెళ్ళడం కుదరడం లేదు. దాంతో పొలం సాగుచేసే పని పడాలెంకన్న జూసుకుంటుంటే బల్లకట్టు నడిపే పని గొల్లభామ చూసుకోడం మొదలెట్టింది.

నల్లగా నాపరాళ్ళలాంటి పిక్కల్తో చాలా బలంగా ఉంటది గొల్లభామ. సీవండి కడియాలున్న కాళ్ళపైకి ఆళ్ళ పసలపూడినేతచీర బిగ్గా లాగి బిగించి బల్లకట్టు మీద నిలబడి చాకచక్యంగా గెడేసి ఆ ఒడ్డునున్న జనాన్ని ఈ ఒడ్డుకీ, ఈ ఒడ్డున్న జనాన్ని ఆ ఒడ్డుకీ జేరేస్తున్న గొల్లభామదూకుడు చూసి ఒక ఆడమణిషేంటి మగోడ్ని మించిపోతా ఇలాగ బల్లకట్టు నడపడమేంటి అనుకోడం మొదలెట్టారు. ఈ అనుకోడం చెప్పుకోడం... అటు కడియం నించి ద్వారపూడి దాకా పాకిపోయింది. అలాగలాగ అనుకుంటా పోతున్న జనం ఆ రేవుని గొల్లభామరేవు అని పిలవడం మొదలెట్టేరు.

పగలంతా అలిసిపోయిన ఇద్దరూ పొద్దోయేకా నూకల అన్నం వండుకుని పుల్లటిచారు కాసుకుని కాలవలో గేలానికి దొరికిన చిన్న చిన్న జెల్లలు, ఎండిన బోదికాలవల్లో దొరికిన బొమ్మిడాయిలు దోరగా వేపి ఉప్పూకారం జల్లుకుని తింటున్నారు. పున్నమిరోజు రాత్రి కల్లు తెచ్చుకు గోదావరి కాల్వలో ఆసే చల్లని చంద్రుడ్ని చూస్తున్నారు. అమావాస్యరోజు తాగేసి కాటుకలాంటి చీకటి చుక్కల్ని చూస్తున్నారు. అలా చూడ్డమే గాకుండా అక్కడికెవరన్నా వస్తే వాళ్ళకి కూడా చూపిస్తున్నారు. వాళ్ళిద్దరూ బతికే ఆ అందమైన బతుకే వచ్చినవాళ్ళకి నేర్పుతున్నారు.

* * *

ఆవేళ గురుపౌర్ణమి.

గాలి పల్చగా వీస్తుంది. ఆ వెడల్పాటి గోదావరి కాలవలో తెరచాప పడవలు అటునించి ఇటూ, ఇటునించి అటూ ప్రయాణం చేస్తున్నాయి.

గుర్రం మీదొస్తున్న కాటన్ దొరగారు తను తవ్వించిన ఆ కాల్వల్ని చూస్తా ఆ నీళ్ళని చూస్తా ఎప్పుడూ అనే మాటే లిక్విడ్ గోల్డ్ అంటా గొల్లభామ పాకముందు ఆగేరు.

ఆ మనిషి పెట్టిన రొట్టిముక్కని తేనిపాణకంలో నంజుకు తిన్నారు తర్వాత. వారితో చేలాసేపు గడిపేక గొల్లభామనీ, పడాలెంకన్ననీ ఆ వెన్నెల్లో తన ముందు కూర్చో బెట్టుకుని అసలు మనిషంటే ఏంటో మానవత్వం అంటే ఏంటో వాళ్ళకి అర్ధమయ్యేభాషలో విడమర్చి చెప్పిన దొరగారు ఎదుటిమనిషి కష్టాల్లో ఉంటే అకస్మాత్తుగా వెళ్ళి మనం ఆదుకోవాలి. మనం బాధల్లో ఉంటే ఎదుటోళ్ళు కూడా రావాలి. అలాగే కులం మతం జాతిభేదం ఇలాంటి పట్టింపులేం ఉండకూడదు. ఈ కాలవలో నీళ్ళు మనకందరికీ ఒకటే అలాగే ఈ ప్రకృతిలో వీస్తున్న గాలికూడా అంతే గొప్పోడి దగ్గర ఓ రకంగా లేనోడి దగ్గర ఇంకోరకంగా వీయదు గదా గాలి? అంటా చాలాసేపు మాటాడి వెళ్ళేరు దొరగారు.

దొరగారి మాటలు వేదవాక్కుల్లా అనిపించినియ్యి గొల్లభామకి. ఆ మర్నాటినించి కాటన్‌దొరగారు చెప్పింది ఎదురైనోళ్ళందరికీ చెప్పడం మొదలెట్టింది.

అయితే మాటలెవ్వరూ ఇదాయికంగా విని పట్టింకోడం జరగలేదు.

దాంతో, చాలా బాధ పడిపోయిన గొల్లభామ "మనం ఎన్నో పూజలు చేసుకుంటేనో, ఎన్నో నోములు నోచుకుంటేనో తప్ప. ఆ మగానుభావుడు ఆళ్ళ దేశం నించి మన దేశమొచ్చి ఈ కాలవలు తవ్వించడు ఈ ముక్కలు చెప్పడు" అనేసి చిరాకు పడ్డం మొదలెట్టింది.

ద్వారపూడి వంతెన దిగువలో ఉన్న ఇప్పనపాడు లాకుల దగ్గరుండే కల్లోళ్ళసాంబులూ, మాణిక్యం పనెత్తుక్కుంటా వచ్చేరు గొల్లభామరేవులోకి.

వాళ్ళని చేరదీసిన గొల్లభామ, ఎంకన్నా "ఈ రేవులోనే ఏదన్నా వ్యాపారవెట్టుకోండి" అన్నారు.

"పెట్టుకోడానికి మా దగ్గర దమ్మిడీ లేదు" అన్నాడు సాంబులు.

మరైతే ఏం చేద్దామా అని ఆలోచించిన పడాలెంకన్నకి "ఊళ్ళో వడ్డీలకి డబ్బులిచ్చే కంచెర్లభద్ద్రావు దగ్గర డబ్బు వడ్డీకి తెద్దావనుకుంటున్నాను ఏవంటారు?" అన్నాడు ఎంకన్న.

విస్తుపోయిన పాపారావు "ఆ కంచెర్లబద్ద్రావు మనలాగ మామూలోడుగాదు ఈడి తాత గోదారవతల ఒక అగ్రహారంలో బ్రేహ్మలకీ వంద నేతి డబ్బాలేసి తర్వాత ఆళ్ళు డబ్బుల్లేవంటే పదెకరాల మాన్యం రాయించుకున్నాడు తెల్సా...ఇప్పటికీ... దాన్ని నేతిచుక్క మాన్యం అనేసి చెప్పుకుంటారు" అన్నాడు.

"మాకు డబ్బులు కావాలి మరెవరిస్తారు బాబూ? చెప్పండి" అన్నాడు పడాలెంకన్న.

"ఇప్పటికిప్పుడు అంటే కంచర్లబద్ద్రావే దిక్కుగానీ కొంచెం జాగ్రర్త మరి ఇంతసేపూ చెప్పింది అర్ధమైంది గదా?" అనేసి అవతలొడ్డు రావడంతో బల్లకట్టు దిగెళ్ళిపోయాడు పాపారావు.

ఉన్నపళాన అప్పిచ్చే మరో మనిషెవడూ దొరక్కపోడంతో బద్ద్రావు దగ్గరకే ఎళ్ళి అడిగేరు.

అనుకున్నట్టే అయ్యింది.

''కాటన్‌దొర మీకు రాసిచ్చిన ఎకరం నేలా నా దగ్గర తణకాబెట్టి పట్టికెళ్ళండి డబ్బు'' అన్నాడు బద్ద్రావు.

ఆయన చెప్పినట్టే చేసి డబ్బు తీసుకుని సాంబులూ మాణిక్యాలచేత కాఫీ హోటలు కిళ్ళీకొట్టూ పెట్టించేరు. కాటన్ దొరగారు చెప్పినమాటలు సాంబులుకీ మాణిక్యానికీ చెప్పింది గొల్లభామ. విన్నారు తప్ప పాటించిన దాఖలాలు లేవు.

మాణిక్యానికి మగపిల్లోడు పుడితే పద్దాలు అని పేరు పెట్టారు.

ఇటు పక్క చూస్తే గొల్లభామకి ఆడపిల్ల పుడితే దానికి పుంతలో ముసలమ్మతల్లి పేరు పెట్టుకున్నారు.

ఆ ఏడాది గింజలు చేతికొచ్చే టైములో దోవారట్టి పంటంతా పాల్లిగాయ అయిపోయింది. దీనికి తోడు అదే ఏడు బల్లకట్టు అడుగున ఇనపరేకు తుప్పట్టి పెద్ద బొక్క పడిపోడంతో దాన్ని రిపేరు చేయించడానికి దవిళేశ్వరం తీసుకెళ్ళి బాగు చేయించుకొచ్చేసరికి తడిసి మోపుడైంది ఖర్చు. ఆ డబ్బుకూడా బద్ద్రావు దగ్గరే తెచ్చేరు.

ఈ అప్పూ, ఎనకటికి చేసిన అప్పు రెట్టింపుకి రెట్టింపు అవ్వడంతో నేతిచుక్కమాన్యాలు రాయించుకున్న వంశంలో పుట్టిన ఆ బద్ద్రావుగారు కాటన్‌దొరగారిచ్చిన ఎకరం పొలం పట్టాలు చంకలో పెట్టుకుపోతుంటే ఆపిన గొల్లభామ కాటన్‌దొరగారు చెప్పినవి చెప్పింది. విని బూరుగుదూది గాలి కెగిరినట్టు నవ్వేసిన ఆ బద్ద్రావు పొలం తాలూకు పట్టాల్నీ తన తోలు సంచిలో పెట్టుకుని పట్టుకెళ్ళిపోయేడు.

కాలం గడిచిపోతానే ఉంది.

గొల్లభామ, పడాలెంకన్నకీ పుట్టిన ముసలమ్మా, సాంబులూ, మాణిక్యాలకీ పుట్టిన పద్దాలు పెద్దోళ్ళయ్యేరు. పెళ్ళికి ఎదిగారు.

కార్తీకపున్నమిరోజది.

గోదావరిగాలి వెనకటికెప్పుడో రాజుగారికి విసిరిన వింజామరలాగ మెత్తగా తగుల్తుంది మెడకి. వెన్నెట్లో కాల్వమీదకి ఒంగి పరుచుకున్న ఆ పెద్ద నిద్రగన్నేరు చెట్టు నీడ నీళ్ళలో కనిపిస్తుంది. అప్పుడో బస్సూ అప్పుడో లారీ వెళ్తా వస్తా ఉన్నాయి. వీటితో పాటు డైనమోలైట్లు బిగించిన సైకిళ్ళుకూడా వెళ్తావస్తా ఉన్నాయి.

అప్పుడే వండుకున్న వేడివేడి ముతక నూకల అన్నాలు పూటుగా తిన్న గొల్లభామరేవులో జనాలు గుంపుగా ఒకచోట జేరేరు. జాతి, కులం, మతం అనేసి విడదియ్యకుండా ముసలమ్మని పద్దాలు కిచ్చి పెళ్ళి చేసేద్దాం అని నిర్ణయించుకున్నారు. దానికి పద్దాలూ, ముసలమ్మా కూడా ఒప్పుకున్నారు.

కడియం చిక్కాలపంతులుగారి దగ్గరకెళ్ళి మంచి ముహూర్తం పెట్టించుకొచ్చి కాంద్రకోట నూకాలమ్మగుళ్ళో పెళ్ళి చేసేసేరు.

ముసలమ్మ కాపరానికొచ్చింది. కాటన్‌దొరగారు చెప్పిన ముక్కలు కూతురు ముసలమ్మకి చెప్పింది గొల్లభామ. పెద్దగా ఎక్కలేదాపిల్లకి.

హాయిహాయిగా గోదావరి పుష్కరాలెళ్ళిపోయి మళ్ళీ వస్తున్నాయి.

ఎక్కడెక్కడి నించో దిగిపోయిన మూడు నాలుగు కుటుంబాలు ఆ గొల్లభామ రేవులో కాపరాలు పెట్టినియ్యి. ఒకళ్ళు సైకిలు షాపూ, ఒకళ్ళు కిళ్ళీకొట్టూ పెట్టుకున్నారు. చిట్టి అనే మనిషి చిన్న పాకేసి దాని ముందు కట్టిన మట్టి అరుగుల మీద కుట్టుమిషనెట్టేడు. దానికి దూరంగా ఇంకో పాకేసుకున్న వడిశలేరు రాజుగారు ఆ పాక ముందు గోనిపట్టా వేసుకూర్చుని భూతవైద్యం చెయ్యడం మొదలెట్టేడు.

స్వతంత్రం వచ్చింది.

దొరలెళ్ళిపోయేరు. మహానుభావుడు కాటన్ దొరగారు కూడా వెళ్ళిపోయేరు.

ఏళ్ళు పూళ్ళు గడుస్తున్నాయి.

ఎఱ్ఱకంకరరోడ్డు తారు రోడ్డయ్యింది. ఆ రోడ్డు మీద రెండెడ్ల బళ్ళు, ఒంటెద్దుబళ్ళు, జట్కాబళ్ళతో పాటు బొగ్గుతో నడిపే పొట్టిబస్సులూ, వేన్లూ కూడా తిరగడం మొదలెట్టినియ్యి.

పడాలెంకన్న, మాణిక్యం, కల్లోళ్ళ సాంబులూ ఒకళ్ళెనకాల ఒకళ్ళు కాలం చేసేరు. గొల్లభామ మట్టుకి వాళ్ళకి చిట్ట చివర్లో పోయింది.

* * *

ఆవేళ పొద్దుటే నిద్ర లేచి గొల్లభామరేవులో ఉన్న సీతాఫలా చెట్టుకి బొట్లు పెట్టి పూజ చేస్తా కనిపించింది సైకిల్‌షాపు ఆదినారాయణపెళ్ళాం బులిపాప.

అక్కడికి మూగిన జనం ''ఇదేంటి?'' అన్నారు.

అర్ధరాత్రి ఒకటికని లేచినప్పుడు ఈ సీతాఫలాచెట్టు వెనకనించి గుగ్గిలం పొగలొచ్చి నియ్యంట. కళ్ళు నులుముకు చూస్తే తెల్ల వాయిలు చీర కట్టుకుని సత్తెమ్మతల్లి అయిన గొల్లభామ కనిపించిందంట.

కనపడ్డమే గాకుండా చాలా నిష్టూరంగా మాటాడిందంట. ''మహానుభావుడు కాటన్ దొరగారు చెప్పిన ముక్కల్ని మీకందరికీ చెపుతుంటే ఎవళ్ళు నన్ను పట్టించుకోలేదు. ఇప్పుడింక ఊరుకోను''అనేసి మన రేవులో కులం జాతి మతం అన్న ముక్కలు ఎవడూ వాడకూడదు. ఆఖరికొస్తే పోవాల్సిన మనవంతా సరిసమానం. మన రేవులో మనకి కలకాలం మతం జాతి మతం రాజూ పేద ఇలాంటియ్యి వసలు ఉండకూడదు. ''ఆ దొర ఎవళికీ చెప్పనియ్యా నాకు మట్టుకే చెప్పినియ్యి మీకు చెప్తున్నాను. మనవంతా ఒక్కటి. అంతే. మనం అలాగే ఉందాం. అలాగే బతుకుదాం. ఒకళ్ళ బాదలొకళ్ళు ఇందాం. ఒకళ్ళ కష్టాలొకళ్ళు పంచుకుందాం''అంది.

''అలాగే తల్లోయ్...'' అనేసి అంతా సత్తెమ్మ తల్లికి దణ్ణవెట్టుకున్నారు.

అంతా ఆ తల్లి చెప్పినట్టే చెయ్యడం మొదలెట్టేరు. గొల్లభామ బతికున్నప్పుడు పెద్దగా పట్టించుకోని జనం చచ్చి సత్తెమ్మ తల్లయ్యేకమట్టుకి ఆ మనిషి చెప్పింది పరమ భక్తితో చేస్తున్నారు.

ఇత్తడిచెంబుకి పసుపుగుడ్డ కట్టి మధ్యలో కంత పెట్టిన ముసలమ్మ ఆగిన పాసింజరు పడవలోళ్ళ దగ్గర రోడ్డు మీదాగిన బళ్ళోళ్ళ దగ్గరా ''సత్తెమ్మగుడి కడ్తన్నాం మీకు తోసిందెయ్యండి ఈ డిబ్బీలో'' అని దండడం మొదలెట్టింది.

చాలా తరాలెళ్ళిపోయినియ్యి ఇప్పుడు గొల్లభామ మునిమనవరాలెవరో బల్లకట్టు లాగుతుందా రేవులో.

ఆ ఏడాది సంకురాత్రి సెలపట్టేరు.

చిడతలు వాయించుకుంటా పాడుకుంటా వస్తున్న హరిదాసు రేవంతా కల తిరుగుతున్నాడు.

భోగిరోజు దగ్గర పడ్తుంది. ఎద్దులడెక్కలు చెక్కి నాడాలు కొట్టే తూర్పుకంసాలి వీరాచారి డబ్బుల్లేక పిల్లలకి బట్టలు చింపించలేదని తెల్సుకున్న శివాలక్ష్మి రేవులో ఆగిన బస్సెక్కి ద్వారపూడెళ్ళి బట్టలు అరువు పట్టుకొచ్చేసింది. పాకుండలూ, నువ్వుపప్పు అరిసెలూ, గోర్మిటీలూ, చల్లగుత్తులూ వండిన బుల్లిపాప అందరికీ తలోకొన్నీ పంచి పెట్టేసొచ్చింది. అందరిబట్టలూ తీసేసుకున్న టైలర్ మస్తానురావు రేవులో తడిపి శుబ్బరంగా కుట్టేసి అప్పజెప్పేడు. ముక్కనుమ రోజున గొల్లభామరేవులో సత్తెమ్మతల్లి సంబరం తీర్థంకూడా జరిగినియ్యి. ఎక్కడెక్కడినించో వచ్చిన జనం చక్రం ఆటలూ గుండాటలూ పెట్టేరు. కోడిపందాలు జరిగినియ్యి. ఆట గట్టడానికి దొమ్మరోళ్ళొచ్చేరు. రకరకాల జనంతో ఒకటే సందడి.

నక్కలోళ్ళ లింగం పెళ్ళాం, గుంపోళ్ళ గనిరాజుపెళ్ళాం, బిందెలకి మాట్లేసే గంగరాజు కూతుళ్ళు కల్సి పెద్ద మేకపోతుని సత్తెమ్మగుళ్ళో బలేసి పన్నెండు కుండల కల్లుపోసి "ఈ రేవులో ఉంటన్న మమ్మల్ని చల్లగా చూడమ్మా సత్తెమ్మతల్లీ" అనేసి మొక్కుకున్నారు.

కల్లుపూటుగా తాగేసి మేకమాంసం పులుసుకిందా, ఇగురుకిందా పలావుకిందా వండుకుని హాయిగా తిన్నారు.

పండుగరోజులెళ్ళిపోయినియ్యి.

ఆవేళ మధ్యాన్నం చలికొంచెం తగ్గడం వల్ల గాలి పిసరంత ఆడకపోడంతో కాస్త చిరచిరలాడతా ఉంది. గొల్లభామరేవులో బయటిజనం ఎవరూ లేరు.

అంతలో రాజమండ్రీ పక్కనించి రెండు జీపులొచ్చి ఆగినియ్యి. అందులోంచి దిగిన జనం రోడ్డు వెడల్పు చెయ్యడానికి ఏంటేంటో లెక్కలేసుకుని వెళ్ళిపోయేరు.

రెండురోజులయ్యేక ఈసారి రెండు జీపుల్తో పాటు మూడు చిన్నకార్లుకూడా వచ్చి ఆగినియ్యి. ఆఫీసర్లతో పాటు పెద్ద పెద్దోళ్ళట ఆళ్ళంతా దిగేరు. కాలవకి ఇవతల ఒడ్డున కొలిచి లెక్కలు అయ్యి వేసి, ఒకళ్ళతో ఒకళ్ళు మాటాడుకుంటా బల్లకట్టు ఎక్కి అవతలొడ్డుకెళ్ళి అక్కడకూడా ఏంటేంటో కొలతలు కొల్చుకుని ఏంటేంటో లెక్కలు గట్టుకుని ఇంకా ఏంటేంటో మాటాడుకుని మొన్న వచ్చిన వాళ్ళ కంటే చాలా ఆలశ్యంగా వెళ్ళేరు.

మొన్న వచ్చిన వాళ్ళ తంతు ఇవేళొచ్చినోళ్ళ తంతు మాత్రం అర్థం కావటం లేదు.

గొల్లభామరేవులో జనానికి. అయితే ఆనాకో రేపో వాళ్ళకి చెప్పబోయే వార్త ఏంటంటే ——

తొందర్లో ఆరోడ్డు వెడల్పు చెయ్యబోతున్నారు. కులమత బేదాల్లేకుండా, ఒకళ్ళ బాధలొకళ్ళు పంచుకుంటా అక్కడ కాపురాలు చేస్తున్న జనం పాకలు మొత్తం లేపెయ్యాలి. తొందర్లో వంతెనకి శంకుస్థాపన చెయ్యబోతున్నారు కాబట్టి ఎన్నో ఏళ్ళనించి తిరుగుతున్న గొల్లభామగారి బల్లకట్టుకూడా శాశ్వితంగా తీసెయ్యాలి.

* * *